

వాకర్ సాయంలో గ్రామ పంచాయతీ కార్యాలయం మెట్లు దిగుతున్న వృద్ధుడు పెద్ద హుసేనయ్య

ఈ చిత్రంలోని వృద్ధుడిపేరు పెద్ద హుసేనయ్య. కర్నూలు మండల ఈ తాండ్రపాడు గ్రామం. ఒకటవ వార్డులో నివాసముంటున్న తొంబైఏళ్ల ఈ వృద్ధుడు పింఛన్ తీసుకునేందుకు పడరానిపాట్లు పడ్డాడు. నగదు తీసుకునేందుకు పంచాయతీ కార్యాలయానికి అతికష్టం మీద వచ్చాడు. కాళ్లనొప్పులతో ఇబ్బంది పడుతున్న ఈ వృద్ధుడు వాకర్ సాయంతో పంచాయతీ కార్యాలయానికి ఇబ్బందులు పడుతూ వచ్చాడు. కార్యాలయం వద్ద మెట్లు ఎక్కేందుకు, నగదు తీసుకున్నాక దిగేందుకు ఆ వృద్ధుడు పడిని పాట్లు వర్ణనాతీతం. ఈయనే కాదు ఇలా ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వృద్ధులందరిదీ ఇదే సమస్య. కూటమి ప్రభుత్వం తమ సమస్యలను గుర్తించి ఇళ్ల వద్దనే నగదు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు పింఛన్ లబ్ధిదారులు.

– కర్నూలు రూరల్

తప్పని 'పింఛన్' నిరీక్షణ

- సచివాలయాలు, రచ్చబండలు, వీధి చివర నగదు పంపిణీ చేసిన అధికారులు
- అవ్వాతాతలు, దివ్యాంగులకు తప్పని ఇబ్బందులు
- గత ప్రభుత్వంలో వలంటీర్లు అందజేసిన సేవలను గుర్తు చేసుకుంటున్న లబ్ధిదారులు


సి.బెళగల్‌లో పింఛన్ కోసం వీధి చివరన పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు


సర్వర్ మొరాయించడంతో నిరీక్షిస్తున్న లబ్ధిదారులు, ఉద్యోగి

సి.బెళగల్: సామాజికి పింఛన్ లబ్ధిదారులకు ఒకట తేదీన నిరీక్షణ తప్పడ లేదు. ఎక్కడ పింఛన్ నగదు అందజేస్తారో స్పష్టత లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. సచివాలయ కార్యాలయాలు, రచ్చబండలు, వీధి చివర అధికారులు పింఛన్ నగదు అందజేస్తుండడంతో లబ్ధిదారులు పరుగులు తీయాల్సి వస్తుంది. ప్రత్యేకించి వృద్ధులు, దివ్యాంగుల ఇబ్బందులు వర్ణానా తీతం. సి.బెళగల్‌లో శుక్రవారం సాగిన పింఛన్ పంపిణీలో లబ్ధిదారులు ఆందోళనకు గురయ్యారు. ఈ ఇబ్బందులు చాలవన్నట్లు సర్వర్ సైతం మొరాయించడతో పింఛన్ లబ్ధిదారులతోపాటు అధికారులు ఇక్కట్లకు గురయ్యారు. ఉదయం నుంచి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పింఛన్ల కోసం వీధుల చివర అధికారుల కోసం పడిగాపులు కాశారు. ఈ రోజు తీసుకోకుంటే మళ్లీ ఇస్తారో లేదో అనే భయంతో వృద్ధులు కొన్నిచోట్ల ఇళ్ల ఎదుట ఆరుగుపై గంటల తరబడి సేదతీరాల్సిన దుస్థితి నెలకొంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే మిన్నగా ప్రజల వద్దకే పాలన కొనసాగిస్తామంటూ ఎన్నికల ముందు కూటమి పెద్దలు ఇచ్చిన హామీలు నీటి మూటల్లా మారాయి. పింఛన్ తీసుకునేందుకు ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు గత ప్రభుత్వంలో వలంటీర్ల ఉదయమే ఇంటి తలుపుతట్టి నగదు అందజేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నారు. టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం పడిగాపులు కాయాల్సి వస్తుందని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు నిట్టూర్చుతున్నారు. ఎట్టకేలకు పింఛన్ పంపిణీ 89 శాతం పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఒటవ తేదీన తప్పని టెన్షన్...

పింఛన్ లబ్ధిదారులు ఒకటవ తేదీన టెన్షన్ తప్పడం లేదు. గత ప్రభుత్వంలో ఒకటిన ఠంఛన్‌గా పిఛన్ అందుకున్న లబ్ధిదారులు టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రతి నెలా ఒకటవ తేదీన టెన్షన్ పడుతూనే ఉన్నారు. పింఛన్ సొమ్ము అందుకునే వరకు తమకు వచ్చిందో... లేదో అనే ఆందోళన చెందుతూనే ఉన్నారు. ఎందుకంటే సి. బెళగల్ మండలంలో కూటమి ప్రభుత్వం ప్రతి నెలా కొందరికి పింఛన్ తొలగిస్తూనే ఉంది. దీంతో లబ్ధిదారుల్లో ఈ భయం నెలకొంది. టీడీపీ కూటమి ప్రభుత్వం నాలుగు నెలల్లో సి.బెళగల్ మండలంలో ఏకంగా 143 మంది లబ్ధిదారులకు పింఛన్ కట్ చేసింది. కనీసం సమాచారం కూడా లేకుండానే పింఛన్ కట్ చేయడంతో అయోమయానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో తమకు వస్తుందో లేదో అనే భయం లబ్ధిదారుల్లో నెలకొంది.

పింఛన్ పంపిణీ చేసిన ఎంపీ

కర్నూలు (రూరల్) : కర్నూలు మండల పరిధిలోని పంచలింగాల గ్రామంలో శుక్రవారం జరిగిన ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమానికి ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరయ్యారు. లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు.

కల్లూరులో ఎమ్మెల్యే గౌరు

కల్లూరు: సామాజిక పింఛన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి శుక్రవారం ఉదయం కల్లూరు అర్బన్ 20 వార్డులో లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. అనంతరం వార్డులో రోడ్ల, డ్రైనేజీల సమస్యలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

● కల్లూరు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లోని పింఛన్ తీసుకునేందుకు లబ్ధిదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఉదయం 8గంటల నుంచి సుమారుగా 12 గంటల వరకు సర్వర్ మొరాయించడంతో పెన్షన్ దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి, ఈఓఆర్డీ నాగేష్ సల్కాపురం, నెరవాడ గ్రామాల్లో లబ్ధిదారులు పింఛన్ సొమ్ము అందజేశారు.

ఓర్వకల్లు: మండలంలో పింఛన్ పంపిణీ ఇబ్బందుల మధ్య కొనసాగింది. ఎంఈఓ ఓంకార్ యాదవ్ పర్యవేక్షణలో పూడిచెర్ల, కేతవరం గ్రామాలలో పంఛన్ల పంపిణీ జరిగింది.

సర్వర్ సతాయింపు

కోడుమూరు రూరల్ : పింఛన్ల పంపిణీలో సర్వర్ సమస్య తలెత్తడంతో సిబ్బంది, లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సర్వర్ సమస్యతో పింఛన్ల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. దీంతో లబ్ధిదారులు పింఛన్లు తీసుకునేందుకు పనులు మానుకుని ఇండ్ల వద్దే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి దాపురించింది. మధ్యాహ్నం తర్వాత సర్వర్ పనిచేయడంతో సిబ్బంది ఎలాగోలా పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు.

క్లుప్తంగా

ఓటరు నమోదపై అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలో ఓటరు నమోదుపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతి ఓటరు తమ ఓటును సరైన పద్ధతిలో సకాలంలో వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో రామనాథ్‌రెడ్డి, ఉసేన్, రంజిత్, బాలరెడ్డి, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబధించి ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించడానికి కృషి చేస్తున్నామని స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

కేసు నమోదు

కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని ఎదురూరు గ్రామానికి ఇద్దరు వ్యక్తులపై కేసు నమో దు చేశామని తాలూకా ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఎదురూరుకు చెందిన షేక్ అమీర్ బాషా, అతని అన్న కుమారుడు షే క్ షబ్బీర్ బా షాపై గురువారం సొంత పనుల నిమిత్తం బైక్‌పై కర్నూలుకు వెళ్లి తిరిగి గ్రామానికి బయలు దేరారు. గ్రామంలోని ఎంపీపీ స్కూల్ సమీపాన వీరి పై అదే గ్రామానికి చెందిన బోయ శ్రీకాంత్, సతీష్ అనే యువకులు బైక్‌ను అడ్డగించి కిందకులాగి దాడికి పాల్పడారు. పిడిగుద్దులు గుద్ది చంపుతామని బెదిరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా రామునాయక్

ఓర్వకల్లు: మండల హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా రామునాయక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కోడుమూరు వర్క్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రా మునాయక్ రిక్వెస్టు బదిలీపై ఓర్వకల్లుకు వచ్చాడు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

కల్లూరు: భూ రీ సర్వేలో తలెత్తిన సమస్యలను పరిష్కారిస్తామని తహసీల్దార్ ఆంజనేయులు తెలిపారు. మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు. సీపీఎం మండల కార్యదర్శి కె.మధు ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

ఘనంగా డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ

కర్నూలు (రూరల్) :మండల పరిధిలోని ఉల్చాల గ్రామంలో శుక్రవారం డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా అధ్యక్షుడు డి.రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీలను తాలు కా సీఐ శ్రీధర్ ప్రారంభించారు. సీఐ మాట్లాడు తూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండా లని,క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. విద్యతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించా లని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకు లు అబ్దుల్లా, సురేష్, అంజి పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఏఐటీయూసీ



ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించిన నాయకులు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో శుక్రవారం ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు మల్లికార్జున ఆధ్వర్యంలో నాయకులు సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్మికులకు అండగా ఏఐటీయూసీ చేసిన పోరాటాలను ఈ సందర్భంగా నాయకులు గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకలు శేషు, పక్కీరన్న, వెంకటేష్, నడిపి నాగన్న, పెద్ద నాగన్న, పెద్ద లింగన్న తదితరులు పాల్గొన్నారు.

'నాతో స్నేహం చెయ్యవూ' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: ప్రముఖ రచయిత డాక్టర్ స్వరూప్ సిన్హా రచించిన 'నాతో స్నేహం చెయ్యవూ' పుస్తకావిష్కరణ కార్యక్రమం గురువారం రాజస్థాన్ కోట వారి శాఖ మోషన్ జూనియర్ కళాశాలలో జరిగింది. ఉస్మానియా కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ మండి అన్వర్ హుసేన్ పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. కార్యక్రమంలో రచయిత జంధ్యాల రఘుబాబు, తెలుగు పండితులు ప్రతాపరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ అంజద్‌బాషా, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, రాకీ కుమార్ పాల్గొన్నారు.

తొగర్చేడులో 'నందికి–వందనం'


ఎద్దులకు పూజలు చేసుతన్న అర్చకులు, మహిళలు

పాణ్యం: మండల పరిధిలోని తొగర్చేడు గ్రామలంలో శుక్రవారం 'నందికి –వందనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎద్దులను ప్రత్యేకంగా పూజించి గ్రామంలో ఊరేగింపుగా చేపట్టారు. ఈ సందర్భంగా రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయాలు, ఔనత్యాన్ని ప్రపంచానికి తెలియజేయాలన్నారు. కార్తీక తొలి సోమవారం 04వ తేదీ అన్ని ప్రాంతాల్లో నందికి -వందనం కార్యక్రమం చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వైఎస్ రెడ్డి, కృష్ణారెడ్డి, మహేశ్వరరెడ్డి, వెంకటేశ్వరనాయుడు, సుధాకరరావు, శ్రీహరి, జనార్ధన్, నాగేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురురాజారావు మృతి పార్టీకి తీరని లోటు


గురురాజారావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: పాణ్యం గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు గురురాజారావు(71) అనారోగ్యంతో కొలుకోలేక హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుత్రిలో మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి శుక్రవారం మృతుడి స్వగృహం చేరుకుని భౌతికాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భగా గురురాజారవు పార్టీకి చేసిన సేవలను కాటసాని గుర్తు చేశారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కాటసాని వెంట మాజీ జెడ్పీటీసీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, నాయకులు కరుణాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, కృష్ణానరెడ్డి, ఎల్లగౌడ్, కో–ఆప్షన్ సభ్యులు జాకీర్, పెద్ద ఎల్లసుబ్బయ్య, బొజ్జన్న, చిన్నోడు తదితరులు ఉన్నారు.

పటేల్ సంకల్పాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి


పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధికారులు

కర్నూలు(సెంట్రల్): దేశ సమగ్ర, ఐక్యత కోసం కృషి చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ సంకల్పాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయశ్రీ సూచించారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సర్ధార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని పురస్కరించుకొని ఏక్తా దివస్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పటేల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడు తూ..భిన్న సంస్కృతులు, జాతులు ఉన్న దేశాన్ని ఏకీకరణ చేసిన సర్దార్ కృషిని కొనియాడుతూ ఏక్తా దివాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ సబీహసుల్తానా, డీఆర్‌డీఏ ఏపీడీ శ్రీధర్ పాల్గొన్నారు.

రోగులకు ఇబ్బందులు లేకుండా చూడండి


ఆసుపత్రిలోని డైట్ విభాగాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే పేద రోగులకు ఎలాంటి ఇబ్బందులూ రానివ్వద్దని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం ఆయన ఆసుపత్రిలోని సూపర్‌స్పెషాలిటీ విభాగాలైన న్యూరోసర్జరీ, యురాలజీ, కార్డియాలజీ, నెఫ్రాలజీ, క్యాజువాలిటీ, ఎంసీహెచ్, గైనిక్, న్యూరాలజీ, ఎండోక్రైనాలజీ, జనరల్ సర్జరీ, మెడికల్, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, డైట్, పలు ఓపీ విభాగాలను సందర్శించి పరిశీలించారు. న్యూరోసర్జరీ విభాగంలోని ఆపరేషన్ థియేటర్‌లో ఏసీలు పనిచేయకపోవడం గురించి ఆరా తీశారు. ఈ ఏసీలు వెంటనే మరమ్మతులకై యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రిలో సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది, స్టాఫ్‌నర్సులు, ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌ఓల ప్రతి నెలా వారు ఏ విభాగాల్లో పనిచేస్తున్నారు, వారి డ్యూటీ రోస్టర్ ప్రతి నెలా తనకు అందించాలని చెప్పారు. వైద్యులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ ఆసుపత్రిలో డ్రెస్‌కోడ్ ధరించాలన్నారు. ఆసుపత్రి ఆవరణ, విభాగాలు రోజూ పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. డైట్ విభాగాన్ని పరిశీలించి రోగులకు మెరుగైన భోజనం అందించాలని చెప్పారు. రోగులను సందర్శించే వారికి విజిటింగ్ పాస్‌లు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో త్వరలో పార్కింగ్ స్థలాన్ని పరిశీలించి అందుబాటులోకి తెస్తామన్నారు. ఆయన వెంట సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్ కుమార్, న్యూ డయాగ్నోస్టిక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ ప్రశాంత్, ఏడీ రమేష్‌బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి తదితరులు ఉన్నారు.


కంకర తెలిన లక్ష్మీపురం రోడ్డు


గుంతలమయంగా మారిన దొడ్డిపాడు రోడ్డు

రోడ్లు అధ్వానం... ప్రయాణం కష్టం


దిన్నెదేవరపాడు రోడ్డు ఇలా...

కల్లూరు: కల్లూరు అర్బన్, గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయి. దీంతో ప్రయాణం కష్టంగా మారింది. 44వ జాతీయ రహదారి నుంచి లక్ష్మిపురం మీదుగా దొడ్డిపాడు గ్రామానికి వెళ్లే రోడ్డు, ఉలిందకొండ నుంచి యాపర్లపాడుకు వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆయా రోడ్లపై ప్రయాణించాలంటే ఒళ్లు హూనామవుతుందని ప్రయాణీకులు వాపోతున్నారు. ఉలిందకొండ నుంచి యాపర్లపాడు గ్రామానికి వెళ్లేందుకు సుమారు 4 కి.మీ ఉంటుంది. అయితే రోడ్డు మొత్తం గుంతలమయంగా మారడంతో అరగంట పడుతుందని ప్రయాణీకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే లక్ష్మిపురం బస్‌స్టాప్ నుంచి దొడ్డిపాడు గ్రామానికి వెళ్లే రోడ్డు కంకరతేలి గుంతలమయంగా మారింది. దొడ్డిపాడు గ్రామంలో ఎక్కువగా కూరగాయాలు, పూల తోటలు ఎక్కువగా సాగు చేస్తారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో సాగుదారులు పూలను మార్కెట్‌కు తరలించేందుకు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.

➡ కర్నూలు నగరంలోని సిల్వర్‌జూబ్లీ కళాశాల నుంచి దిన్నెదేవరపాడు గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. సిల్వర్‌జూబ్లీ కళాశాల నుంచి సైనిక భవనం వరకు రోడ్డు నెర్రలిచ్చింది. అలాగే మిలటరీ క్యాంటీన్ సమీపంలో రోడ్డు గోతులమయంగా మారింది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. తాత్కాలికంగా మట్టి, కంకర వేసి మరమ్మతులు చేయాలనే విషయాన్ని అధికారులు మరచిపోయారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దిన్నెదేవరపాడు గ్రామానికి రోడ్డు వేయించాలి



మా గ్రామం నుంచి లక్ష్మిపురం గ్రామానికి వేళ్లే రోడ్డు గుంతలమయంగా ఉంది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రజలు అవస్థలు పడాల్సి వస్తుంది. ద్విచక్రవాహన చోదకులు రోడ్డు ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి నూతనంగా రోడ్డు నిర్మిస్తే బాగుంటుంది. – చిన్న మహబూబ్ బాషా, దొడ్డిపాడు

నివాళి


పటేల్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

కల్లూరు: కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశం కోసం పటేల్ చేసిన సేవలను ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి కొనియాడారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేష్ పాల్గొన్నారు.

చిరస్మరణీయురాలు ఇందిరాగాంధీ


ఇందిరా, పటేల్ చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్‌నాయకులు

కర్నూలు(సెంట్రల్) : దేశంలో 14 ప్రైవేట్ బ్యాంకులను జాతీయం చేసి పేద, మధ్యతరగతి ప్రజలకు రుణాలు ఇప్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ చిరస్మరణీయురాలని డీసీసీ అధ్యక్షుడు పి.మురళి కొనియాడారు. అలాగే సర్దార్ వల్లాభాయ్ పటేల్ వీరోచిత పోరాటంతోనే తెలంగాణకు నిజాం రాజు నుంచి విముక్తి లభించిందని కీర్తించారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరా గాంధీ వర్థంతి, పటేల్ 149వ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఇద్దరి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర బాబు, నాయకులు బతుకన్న, షేక్ రియాజుద్దీన్, సయ్యద నవీద్, కె.సత్యనారాయణగుప్తా, ప్రమీళ, వెంకటసుజాతా తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వెంకటేశ్వర్లుకు ఘన సన్మానం


డాక్టర్ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న ఆర్థోపెడిక్ విభాగం వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కె. వెంకటేశ్వర్లును ఆర్థోపెడిక్ విభాగం వైద్యులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఆసుపత్రిలోని ఆర్థోపెడిక్ విభాగంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. డాక్టర్ వెంకటేశ్వర్లు కేక్ కట్ చేయగా వైద్యులు అభినందనలు తెలిపారు. అనంతరం ఆర్థోపెడిక్ హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఆర్థోపెడిక్ విభాగంలో పనిచేసిన డాక్టర్ వెంకటేశ్వర్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ కావడం గర్వకారణమన్నారు. ఆయన సేవలు ఆసుపత్రికి ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఇలియాస్‌బాషా, విజయమోహన్‌రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.